


"నే కోటిగాడ్నే చేసుకుంటానయ్యా!" అంది నాగులు.

"అదికాదే! ఆ మాధారంవాళ్ళకి 10 ఎంట్ల భూమి పుట్రా వున్నాయే! అహా నివ్వమంటే పడి సస్తన్నాడు. ఓటికి పదిసార్లు వాళ్ళే కావాలని తిరిగారు. కాదంటం బాగోదు" అని రామన్న ఒక్క కూతురని గారాబంగా పెంచటంతో బుజ్జగింపుగానే చెప్పాడు. తల అడ్డంగా తిప్పింది నాగులు.

"కాదు మాలోడాయే! మనం మాదు గులం. నలుగురూ చూస్తే ముఖానఉమ్మేత్తారు" సంఘం భయంతో అన్నాడు రామన్న.

"అదంతేనయ్యా!" మొండిగా నాగులు.

కోటిగాడికీ, కూతురికీ వున్న సంబంధం ఆనోటా, ఆనోట రామన్న చెవిలో పడక పోలేదు. కాని నమ్మలేదు. కాని పెళ్ళి దగ్గర కొచ్చేసరికి తప్పలేదు. కులంలో మంచోడని పేరుంది. పరువు పోదని భయం.

"అదేం కుల్లేదు. రేపీపాటికి మాధారం పోరగాడు నీ మెళ్ళో తాళి గడతాడు. రామన్నంటే ఏమనుకున్నావో!" అని బెదిరించి ఇంటికి గట్టి కాపలా పెట్టి మాధారం బయల్దేరాడు రామన్న.

ఆ రాత్రంతా నిద్దర్లేదు నాగులికి. గుడిసె రన్నలోంచి కనిపించే చంద్రుణ్ణి చూసి కోటిగాడనుకొని సిగ్గుపడది. కాకపోయేసరికి ఏడ్చింది. మర్రోజు లోకానికి చీకటి పోగొడుతూ సూర్యుడు ఏడు గుర్రాలెక్కొత్తే, నాగులు జీవితాన్ని బలిగొనే యముడిలా కొత్త పెండ్లికొడుకు రెండెడ్లబండి దిగాడు.

మల్లిగాడేం కొత్తకాదు నాగులికి. దూరం చుట్టం కూడా. ఏ పెళ్ళిలో కలిసిన కన్నెంచే పడతాడు. ఏమేంటో వాగుతాడు. కాని వాణ్ణెప్పుడూ పట్టించుకోలేదు నాగులు.

కిటికీలోంచి కోటిగాడి కోసం చూస్తున్న నాగుల్ని చూసి పళ్ళికిలించాడు మల్లిగాడు.

పగలంతా వచ్చిపోయే వాళ్ళు సరసాలాడుతున్నారు. రాత్రి రూం పోద్దుపోయాక అందరూచేరి 'చిలకా గోరింకల్లా వున్నారు. వందేళ్ళు బతకండి" అని దీవించారు. నాగులు మాత్రం శ్రావణ మేఘంలా కన్నీరు కారుస్తూనే వుంది. "పెళ్ళి చూపెందుకు తల్లి లేదని బెంగగావుంలు" అనుకున్నారంతా.

వచ్చిన నలుగురూ తాగి తందనాలాడేసరికి బలుసు తెల్లారింది. బండెక్కమన్నాడు రామన్న నాగులి తల నిమురుతూ.

"నేనాడుండలేనయ్యా!" అంది నాగులు

"అదేం లాభంలేదే! ఇది నూరేళ్ళ పంట. మూడుముళ్ళూ పడ్డాయి. అంతా బాగానే వుంటుందిలే, పో!" అని బలవంతంగా బండెక్కొచ్చాడు రామన్న.

మొదటిరోజే "నే నెంగిలి పడ్డా"నని మల్లిగాడికి చెప్పింది నాగులు

ఒక్క నిముషం ఉడుకున్న మల్లిగాడు

"దాందేవుందే! పెద్ద పెద్దోళ్ళే ఎంగిలడితే సెప్పుకోలేక నోరు మూసుకుంటున్నారు" అన్నాడు.

"నీవు నావోడివి కాదు" అంది నాగులు.

"నీవు నా దానివి" అన్నాడు మల్లిగాడు.

"నన్నాలోసించుకోనీ" అంది నాగులు.

చదువుకున్నోళ్ళు చూపని సంయమనం చూపాడు మల్లిగాడు.

తెల్లారిచూస్తే పక్కమీదలేదు నాగులు. నాగారం వెళ్ళిపోయింది. మల్లిగాడు పోయి రమ్మని బతిమాలాడు, అందరూ కలిసి మళ్ళీ ముళ్ళ పొదల్లోకి నెట్టారు. ఇట్టా నాలుగు సార్లయింది. ఐదోసారి మల్లిగాడి అన్నలే పోయి తీసుకొచ్చారు. ఇంట్లో పడేసి బాదారు

"ఏహా! దాని కొట్టమాకండి" అని అడ్డు పడ్డ మల్లిగాడికీ నాలుగు తగిలాయ్.

"సిగ్గులేని ఎదవ! కొట్టొద్దంటావేం" అని నలుగురూ వాణ్ణి పక్కకి లాగారు.

"మళ్ళీ పోతవటే" బాదారు.

నాగులు నోరు మెదపలేదు

అమాయకుల్తో నైతం తప్పొప్పించే పోలీసోళ్ళలా కొట్టారు.

"ఇంక పోను" అబద్దం చెప్పానని ఆ రాత్రే రుజువు చేసింది నాగులు. ఏడ్చి ఏడ్చి ఎరుపెక్కిన కళ్ళతో చీకట్లో నడుస్తున్న నాగులు కొరివిదయ్యంలా వుంది. ఇక ఈ పొలిమేర తొక్కకూడ దనుకుంది.

తన మనస్సు ఇనుమును లాగుతున్న అయస్కాంతం కోటిగాడి దగ్గరికే పోయింది ఏకాయెకి. నాగారంలో వుంటే మళ్ళీ వొత్తారని ఆ రాత్రే ఉడాయించారిద్దరూ!

ఈ తడవ మాదారం గూడేనికే సవాలయింది. రెండు రాత్రిళ్ళు పగళ్ళు తిరిగి పట్టుకున్నారు కోటిగాడిని వదిలేసారు. విశ్వాసాన్ని ప్రేమించిన ఏసుక్రీస్తును సిలువకి కట్టేస్తే – కోటిగాణ్ణి ప్రేమించిన నేరానికి నాగుల్ని చింతచెట్టుకు కట్టేశారు.

"మొగుడుతో కాపరం చెయ్యాల్సిందే" నన్నారు కొందరు రైతులు.

"అదేం లాభంలేదు. దానిష్టం" అన్నారు మరికొందరు మామూలుగా వూళ్ళోవుండే పోటీకొద్దీ. ఎండాకాలం మిట్ట మధ్యాహ్నం చెట్టుకు కట్టేసివున్న నాగులు నోరుమెదపలేదు. సినిమాల్లో తప్ప జీవితంలో ప్రేమ చూడని కుర్రకారుకు వింతగానేవుంది. అరఫర్లాంగు దూరంలో బండ మీద నాగులికేసి చూస్తున్న మల్లిగాణ్ణి ఎవరూ చూట్టంలేదు.

సాయంత్రం అయ్యేసరికి ఊరంతా రెండుగా చీలి, మాదిగ ముండకోసం తలకాయలు పణంగా పెట్టటం ఊరి పెద్ద రంగయ్యకు సుతరాం ఇష్టంలేదు.

ఇలా రైతులు చీలిపోయివుంటే ఈమాలి మూక ఎప్పటికైనా ఒకటై ఊరు మీద విరుచుకపడతారని ఆయన భయం. అందర్నీ పిలిచి రచ్చబండమీద పరిష్కారం చేద్దామంటే మాదారంగూడెంవోళ్ళు ఒప్పుకోలేదు.

"అది ఇడిస్తే సాదిపోద్దండి" అన్నారు. ఈ తాళ్ళు దాని గుండెల్ని కట్టేయలేవన్న నిజం తెలీని అమాయకులు సరే అని ఊళ్ళో పెద్దలంతా అక్కడికే చేరారు.

"ఏమే! వాడితో కాపురం చేయవా?" అన్నాడు రంగయ్య.

ఒకసారి ఆశగా తలెత్తాడు మల్లిగాడు.

"చెయ్యను దొరా" నూతిలోంచైనా గట్టిగానే చెప్పింది నాగులు. మల్లిగాడు పక్కకు తిరిగి ముఖం తుడుచుకున్నాడు.

"ఎందుకని? వాడు పనికిరాడా!"

"నాకు తెలీదు బాబయ్యా!" నిప్పులాంటి నిజం చెప్పిం దనుకున్నాడు మల్లిగాడు.

చేసేది లేక తర్జనభర్జన చేసి ఓ వంద రూపాయలు తప్పు కట్టమనీ, దాన్ని ఇప్పి

యమనీ తీర్పు చెప్పాడు రంగయ్య. అందరూ సమస్య తీరినట్లు చేతులు దులుపుకున్నారు.

మల్లిగాడి అన్న అడిగాడు "పైకం ఎవరు కడతారని."

"ఎవరు కడతారు? రంగన్నే."

"బాబ్బాబూ! మీకు పున్నెం వుంటది. ఏదో కన్న నేరానికి పెళ్ళి చేశా! మీ ఇష్టం! దాన్ని నరకండి! పోగులెట్టండి! నే బీదోణ్ణి! నేకట్టలే" నన్నాడు రామన్న.

సరే కోటిగాడ్ని కట్టమన్నారు.

"నే నే తప్పు చెయ్యందే నే నెందుకు కడతా" నన్నాడు కోటిగాడు.

నాగుల్ని కట్టమన్నారు.

"నా ఇష్టం వచ్చినాడితో వుంటానికి నేనెవరికే తప్పుకట్టంది ధైర్యంగా నాగులు

"సరే! ఎవరూ కట్టకపోతే మానేయండి! తప్పులేమూ. ఒప్పులేదూ" అన్నాడో ముసలాడు

"అదేం లాభం లేదు" అన్నారు కుల పెద్దలు జారిగిపోతున్న సారా వాసనల్ని తలుచుకుంటూ.

"అనవసరంగా అలగా జనం పంచాయతీ కొచ్చినందుకు నేనేభై కడతా"నన్నాడు రంగయ్య తలా పదీ వసూలుచేసి కట్టేశారు. నాగుల్ని ఇప్పేశారు. లోకాన్ని జయించిన నాగులు కోటిగాడి పక్కన నిలబడింది.

పట్టి పున్యానికి డబ్బు పోయిందని బాధ పడుతున్న రంగయ్య.

"ఒసే! నాగులూ! కోటిగాడ్ని వదిలేసి మళ్ళీ మారుమనువన్నావంటే నీ ప్రాణాలు తీసేస్తా!" అన్నాడు!

అంతసేపూ మౌనంగా వుండి ఏమీ పట్టించుకోని మల్లిగాడు రంగయ్య కాళ్ళమీద పడి "బాబుగారూ అంత మాటనకండి" అని వేడుకున్నాడు.

నాగులు రెండు చేతులు పట్టుకొని "ఒసేఁ ఉంచుకున్నోడు ఎన్నటికీ మొగుడు కాడే! వాడొగ్గేస్తే నాకాడి కొచ్చేయ్" అని ఆ చేతులమీదే కన్నీళ్ళు కార్చాడు.

★

# నిర్భాగ్యుడిని

-జి. యన్. వి. సత్యనారాయణ

నేడే స్వాతంత్ర్య దినోత్సవం
కాని నాకులేదు ఏ సంతోషం
నేనొక సామాన్యుడిని
తెలుగుతల్లి ముద్దుల బిడ్డను
నవనాగరికతా నీడల్లో
బ్రతకలేక బ్రతుకుతున్న
నిర్భాగ్యుడిని
నాకులేదు కూడు
నా బ్రతుకే ఒక బీడు
నాకులేదు గూడు
నా జీవితమే ఒకగోడు
ఆకాశాన్నంటుతున్న ధరలనుచూసి
నాలోనేను పిచ్చిగ నవ్వుకొంటున్న
వాడిని
నమ్ముతే నా జీవిత పరమార్థంగా
భావిస్తూ బ్రతుకుతున్న వాడిని
అన్నపూర్ణగా ఘనతకెక్కిన
మనదేశం
అన్యదేశాలను ధాన్యమడుగుతున్న
దంటే—
తెలుగుబిడ్డగా నేను సిగ్గుపడుతున్నాను